క్లుప్తంగా

సిద్ధి వినాయకునికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సిద్ధి వినాయకుడు

పెదపూడి: మండలంలోని సంపర పంట కాలువ సమీపంలో గల సిద్ధి వినాయక ఆలయంలో బుధవారం భాద్రపద మాసం సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు, గరిక పూజ నిర్వహించారు. గణపతి నవరాత్రుల ఉత్సవాలకు సంబంధించి ఉదయం 9.09 గంటలకు అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు రాట ముహూర్తం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న యువరాజారెడ్డి

పెదపూడి: మట్టి వినాయక ప్రతిమలతో చవితి వేడుకలు చేసుకుని పర్యావరణాన్ని కాపాడాలంటూ జి.మామిడాడ గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు ద్వారంపూడి యువరాజారెడ్డి అన్నారు. గ్రామంలో బుధవారం ఉచితంగా 200 మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనాన్ని కాపాడండి, ప్రకృతిని ప్రేమించండి, పర్యావరణాన్ని రక్షించండి అనే నినాదంతో ఈ మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్నామన్నారు.

దోమల నివారణకు మందు పిచికారీ



పెదరాయవరంలో మురికి కాలువల్లో పూడిక తీస్తున్న కార్మికులు

రంగంపేట: మండలంలోని పెదరాయవరం గ్రామంలో సర్పంచ్ బరగటి సుజాత ఆధ్వర్యంలో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుజాత, పంచాయతీ కార్యదర్శి కాత్యాయనీ మాట్లాడుతూ వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున మురికి కాలువల్లోని పూడిక తొలగించి దోమలు వృద్ధి చెందకుండా ఎబేట్ మందు, కాలువలకు ఇరువైపులా గడ్డి మందు పిచికారీ చేయించామన్నారు. అదేవిధంగా నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లించామన్నారు.

అన్నదాతకు వాయుగండం

- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు
- ముంపునకు గురైన పంటలు
- వరిని ఆశించిన ఆకుముడత, మాగుడు తెగుళ్లు
- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు



శ్రీరంగపట్నంలో సాగు చేసిన వరి పంట



మునగాలలో నీట మునిగిన వరి పంట



బూరుగుపూడిలో వరి పొలంలో కలుపు తీస్తున్న కూలీలు

మధురపూడి: విస్తారంగా కురుస్తున్న వర్షాలు అన్నదాలను ముంచుతున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండం మారి విస్తారం వర్షాలు కురిసిన వర్షాలకు ఖరీఫ్ పంటలు నీట మునిగాయి. వేసిన కొద్ది రోజులకే పంట ముంపునకు గురవడంతో తెగుళ్లు ఆశించాయి. అప్పు చేసి పెట్టిన పెట్టుబడి నీటిపాలవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇదిలా ఉండగా గోదావరి ఎగపోటు వరదల కారణంగా కోరుకొండ, సీతానగరం మండలాల్లో 3,500 ఎకరాల పంట నీటమునిగిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాను కల్పిస్తోందన్న ఆశలు అడియాశలయ్యాయి. దీంతో సమస్యల వలయంలో అన్నదాతలు కూరుకుపోయారు. రాజానగరం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 64,965 ఎకరాల విస్తీర్ణంలో వరిపంట సాగవుతోంది. అలాగే అనపర్తి నియోజకవర్గంలో 29,685 ఎకరాల్లో చేస్తున్నారు. గత పదిరోజులుగా పంటలు నీటి నానడంతో పంట పాడైపోవడంతో రైతులు కొన్ని ప్రాంతాల్లో మళ్లీ నాట్లు వేశారు. మొదటి దఫా రూ.20వేల పెట్టుబడి, రెండో దఫా రూ.40 వేల పెట్టుబడి అంతా నీటిపాలైందని ఆందోళన చెందుతున్నారు. పంట ఎక్కువ రోజులు నీటిలో నానడంతో తెగుళ్లు ఆశించాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆకుముడత, మాగుడు తెగుళ్లు సోకాయంటున్నారు.

నివారణ చర్యలు ఇలా

ఆకుముడత తెగులు నివారణకు కార్టఫ్ హైడ్రో క్లోరైడ్ 2.0 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే మాగుడు తెగులు నివారణ నిమిత్తం హెక్సాకోనాజోల్ 2.0 మిల్లీలీటర్ల మందు, లేదా, ప్రోపికోనాజోల్ 1.0 మిల్లీలీటర్లు లీటరు నీటిలో కల్పి పిచికారీ చేయాలన్నారు. ఈ తెగులు నివారణకు ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్, టెబ్యూ కోనాజోల్ లేదా అజాక్సీ స్ట్రోబిన్ 1.5 మిల్లీటర్లు మందును లీటరు నీటిలో కల్పి పిచికారీ చేయాలన్నారు. అలాగే 30 కిలోల పొటాష్‌తో పాటు, 20 కిలోల యూరియాను వేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి ఎ.గౌరీదేవి తెలిపారు.

కౌలు రైతులను ఆదుకోవాలి



రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. శ్రీరంగపట్నానికి చెందిన 500 మంది వివిధ గ్రామాల్లో భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. రైతులు పెట్టుబడి అంతా నీటి పాలైంది. ప్రభుత్వం కౌలు రైతులకు, రైతులకు పంట నష్ట పరిహారం, పెట్టుబడి సాయం అందించాలి.

– అత్తిలి శ్రీరామచంద్రమూర్తి, శ్రీరంగపట్నం

కష్టం నీటి పాలు



విస్తారంగా కురుస్తున్న వర్షం రైతులను నిండా ముంచింది. పెట్టిన పెట్టుబడి, కష్టం నీట మునిగింది. కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాల్లో పంటలకు తెగుళ్లు ఆశించాయి. మళ్లీ పెట్టుబడి పెట్టే స్తోమత మాకు లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

– బాసా సత్యనారాయణ, రైతు, గాదాల

వరద బాధితులకు ఆహార పొట్లాల తరలింపు



విజయవాడకు భోజన ప్యాకెట్లు తీసుకెళ్తున్న వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



రంగంపేటలో ఆహార ప్యాకెట్లు తీసుకెళ్లే వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పెదపూడి: విజయవాడ వరద బాధితుల కోసం అనపర్తి మండలంలోని బుద్ధవరపు చారిటబుల్ ట్రస్ట్, బలభద్రపురం గ్రామంలోని ఆంధ్రా షిరిడీ సాయి మందిరం, శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాల సౌజన్యంతో 9 వేల భోజన ప్యాకెట్లు సిద్ధం చేశారు. అనపర్తిలోని దేవీ చౌక్ సెంటర్ నుంచి భోజన ప్యాకెట్ల తీసుకెళ్లే వాహనాలను ఎమ్మెల్యే ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన భోజన ప్యాకెట్లు ఏర్పాటు చేసిన దాతలను అభినందించారు.

రంగంపేట: కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు విజయవాడలో వరద బాధితులను ఆదుకునేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం ఆహారం పొట్లాలు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, రెవెన్యూ సిబ్బంది 2,500 ఆహార పొట్లాలను తయారు చేసి వ్యాన్ ద్వారా విజయవాడ తరలించారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన



నరేంద్రపురంలో ప్రగడ రాంబాబు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన వ్యవసాయాధికారులు, ప్రకృతి వ్యవసాయ అధికారులు

రాజానగరం: ఆరోగ్యవంతమైన ఆహార ఉత్పత్తులను అందుకోవాలంటే ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. మండలంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను బుధవారం ఆయన సందర్శించారు. ప్రకృతి వ్యవసాయంపై జిల్లా స్థాయి వ్యవసాయాధికారులు, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా మేనేజర్లకు గుంటూరు జిల్లా, తాడేపల్లిలో రెండు రోజులపాటు శిక్షణ ఇచ్చారు. అనంతరం జిల్లాలోని ఏడీఏ, ఎంఏఓలకు కూడా రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరంతా కలిసి మండలంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడంతో వారి అనుభవాలను కూడా తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఇందులో భాగంగా నరేంద్రపురంలోని నాలుగు ఎకరాలలో సాగు చేస్తున్న ప్రగడ రాంబాబు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి, అక్కడ పండిస్తున్న బీర, కాకర, పొట్ల, దొండ, పసుపు, కీరదోస, ఆనప, మున్నగు పలు రకాల కూరగాయల సాగును, వాటికి ఉపయోగిస్తున్న సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించారు. కోతకు వచ్చిన తరువాత వాటిని రాజమహేంద్రవరంలోని గ్రేటెడ్ కమ్యూనిటీస్ కుటుంబాలకు విక్రయిస్తున్నారు. అలాగే నందరాడలో గుత్తుల సూర్యనారాయణ నిమ్మతోట, కొబ్బరి తోట, ఏటీఎం మోడల్ కూరగాయల సాగును పరిశీలించారు.

కేవీకేలో వ్యవసాయ క్షేత్రాల సందర్శన

కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని కూడా వారు సందర్శించి, అక్కడ ఉన్న ఏ గ్రేడ్ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను, ఏడాది పొడవునా పండించే ఏటీఎం మోడల్ కూరగాయల సాగు విధానాన్ని తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ శాఖ జిల్లా మేనేజర్ బి.తాతారావు, సహాయాధికారి వలీ, డీఆర్‌సీ ఏడిఏ జయలక్ష్మి, డాట్ శాస్త్రవేత్త నరసింహరావు, ఎన్‌ఎఫ్‌ఏలు గౌతమ్, సతీష్, పలువురు ఏడిఏలు, ఏఓలు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక



మానేపల్లి నాగార్జున



అనురాధ



విజయదుర్గ



పితాని సత్యనారాయణ

పెదపూడి: అనపర్తి మండలం నుంచి తూర్పుగోదావరి జిల్లాకు ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులు ఎంపికైయ్యారని ఎంఈఓ ఎస్.సత్తిరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ మండలంలో రామవరం ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న గణిత ఉపాధ్యాయుడు మానేపల్లి నాగార్జున, అనపర్తి ప్రాథమిక పాఠశాలకు చెందిన అనురాధ, పొలమూరు ఉన్నత పాఠశాలకు చెందిన విజయదుర్గ ఎంపికయ్యారన్నారు. వారికి ఆయన, ఇతర ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

బిక్కవోలు మండలంలో..

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పితాని సత్యనారాయణ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను బిక్కవోలు ఎస్టీయూ మండల శాఖ ప్రతినిధులు అభినందించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు తెలిపారు. బుదవారం రఘుదేవపురం -1లో డాక్టర్ రాజు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 51 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఇంటి పరిసరాల్లో అపరిశుభ్రత వల్ల ఈగలు, దోమలు వృద్ధి చెంది డెంగా, మలేరియా, టైఫాయిడ్, ఫైలేరియా, చికున్ గున్యా వంటి సీజనల్ వ్యాధులు వస్తాయని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.సుధాకర్, ఏఎన్‌ఎం వరలక్ష్మి, ఆశావర్కర్లు దుర్గ, కుమారి, షర్మిల తదితరులు పాల్గొన్నారు.

కొంకుదురులో వైద్య శిబిరం

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు సచివాలయం వద్ద స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు జి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 65 మంది రోగులను పరీక్షించి 12 మందికి జ్వరం ఉన్నట్లుగా గుర్తించారు. వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎవరికైనా రెండు రోజులకు మించి జ్వరం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్తి వీరమణి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆవ కాలువలో పూడికలు తొలగించండి



హుకుంపేటలో ఆవ కాలువను పరిశీలించి సూచనలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం నగరం నుంచి వర్షపునీరు, మురుగునీరు ప్రవహించే ఆవకాలువ పూడికతీత పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు వలన ముంపుకు గురయ్యే హుకుంపేట ప్రాంతాన్ని ఆమె, మండలస్థాయి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ భారీ వర్షాలు, గోదావరి ఉధృతి వలన హుకుంపేట, బొమ్మూరు పరిసర ప్రాంతాలు మునగకుండా శాస్వత చర్యలు చేపట్టాలన్నారు. ఆవకాలువ పూడికలతో పాటు, ఆక్రమణలను త్వరితగతిన తొలగించాలని ఆదేశించారు. అలాగే ప్రమాదకరంగా ఉన్న ఆర్‌అండ్‌బీ కల్వర్టు నిర్మాణం త్వరితగతిన నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ లక్ష్మీరమ్య, డీఆర్‌డీఏ పీడీ మూర్తి, పంచాయతీ కార్యదర్శి గుంట్రు వెంకటరావు, టీడీపీనేతలు పాల్గొన్నారు.

సమాచారహక్కు చట్టంపై అవగాహన ఉండాలి

రాజమహేంద్రవరం రూరల్: సమాచారహక్కు చట్టంపై అధికారులు అందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. స్థానిక ఇన్నీసుపేట అరుణప్యాలెస్ ఫంక్షన్ హాల్లో ఆయన అధ్యక్షతన సహాయవ్యవసాయసంచాలకులు, మండల వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులకు సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ 4(1)(బి)సెక్షన్‌పై వివరణ ఇస్తూ తగిన రికార్డ్స్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. అధికారులను తమ కార్యాలయంలలో సమాచారహక్కు చట్టం 2005 సెక్షన్4(1)(బి)(16) ప్రకారం బోర్డ్స్‌ను పౌరులకు అందుబాటులో ఉండేటట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

నూతన సభ్యత్వాల నమోదు

కడియం: సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్‌లో నూతనంగా సభ్యులుగా చేరేవాళ్లు కడియపులంకలోని అసోసియేషన్ కార్యాలయం వద్ద సంప్రదించాలని పాలకవర్గం అధ్యక్షుడు మల్లు పోలరాజు కోరారు. ఈనెల 6వ తేదీ వరకూ సభ్యత్వ నమోదు జరుగుతుందన్నారు. ఈ మేరకు నర్సరీ రైతులు గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పీహెచ్‌సీలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు



ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేస్తున్న వైద్యులు

రాజానగరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో బుధవారం కుటుంబ నియంత్రం శస్త్ర చికిత్సల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో పీహెచ్‌సీ వైద్యులు జి. రామభాస్కర్, సీహెచ్ వెంకటలక్ష్మిల ఆధ్వర్యంలో ఐదుగురికి ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేశారు. గత కొంతకాలంగా పీహెచ్‌సీల పరిధిలో కుటుంబ నియంత్రణల శస్త్ర చికిత్సలు ఆగిపోయాయి. ఈ శిబిరంతో వాటిని పునఃప్రారంభించారు.

ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులు



జి.మామిడాడలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

పెదపూడి: ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులని జి.మామిడాడ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సత్తి వెంకటరెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలకు చెందిన మొత్తం 13 మంది ఉపాధ్యాయులను బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక విద్యార్థిని ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. అనంతరం ఎంఈఓ-2 సీవీవీ సత్యనారాయణను సన్మానించారు.

హెల్త్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు

మధురపూడి: కోరుకొండ పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.శ్రీనివాసరావు రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొన్నారని గోకవరం గ్రామానికి చెందిన జౌళి చేనేత శాఖ కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు చావలి మహేష్ బుధవారం డీఎంఅండ్‌హెచ్‌ఓకు ఫిర్యాదు చేశారు. విధులకు సెలవు పెట్టి మరీ జనసేన అధినేత పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారని, సక్రమంగా ఉద్యోగం చేయడం లేదని పేర్కొన్నారు. దీనిపై డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటేశ్వరరావును వివరణ కోరగా, ఫిర్యాదుపై ఎంక్వయిరీ చేస్తున్నట్టు తెలిపారు. రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొన్నట్టు నిర్ధారణ అయితే శాఖాపరమైన చర్యలుంటాయన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

రంగంపేట: మండలంలోని సింగంపల్లి ఆయిల్‌ఫామ్ తోటలో రహస్యంగా కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరంపై దాడి చేసి ఇద్దరిని అరెస్ట్ చేశామని, మరికొందరు పారిపోయారని ఎస్‌ఐ తోట కృష్ణసాయి బుధవారం తెలిపారు. ఘటనా స్థలంలో 16 మోటారు సైకిళ్లు, 4 కోడి పుంజులు, 4 కోడి కత్తులు, రూ.450 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారైన వారిని గుర్తించి త్వరలోనే అరెస్టు చేస్తామని చెప్పారు.